ప్రజాశక్తి

గురువారం 18 సెప్టెంబరు, 2025

5

శ్రీకాకుళం



నేడు నూతన ఉపాధ్యాయులు విజయవాడకు పయనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

డిఎస్‌సిలో ఎంపికైన ఉపాధ్యాయులకు విజయవాడలో ఈనెల 19వ తేదీన ధ్రువీకరణ పత్రాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందజేయనున్నారు. జిల్లాలో డిఎస్‌సికి ఎంపికైన ఉపాధ్యాయులు గురువారం బస్సుల్లో పయనం కానున్నారు. ఇందుకోసం విద్యాశాఖ 37 బస్సులు ఏర్పాటు చేసింది. జిల్లా నుంచి 535, జోనల్ స్థాయిలో జిల్లా నుంచి 140 మంది మొత్తం 675 మంది ఎంపికయ్యారు. ఉపాధ్యాయులతో పాటు తోడుగా మరొకరికి అవకాశం కల్పించారు. జిల్లా నుంచి 1350 మంది విజయవాడ పయనమవుతున్నారని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు తెలిపారు.

- ఎనిమిదేళ్ల కిందట ప్రారంభమైన వంశధార, నాగావళి అనుసంధాన పనులు
- ఇప్పటికీ 20 శాతం పనులు పెండింగ్
- నిధులు కేటాయించని టిడిపి, వైసిపి ప్రభుత్వాలు
- తాజాగా డిసెంబరు వరకు ఒప్పంద కాలపరిమితి పొడిగింపు

సరుబుజ్జిలి మండలం చిరువలస సమీపంలో అర్థాంతరంగా ఆగిన హైలెవల్ కెనాల్ పనులు (ఫైల్)



పాలకులు మారినా

ప్రాజెక్టు దశ మారలే

వంశధార - నాగావళి నదుల అనుసంధాన పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. టిడిపి హయాంలో 2017లో పనులు మొదలయ్యాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం, ప్రాజెక్టు పూర్తి చేయడంపై పెద్దగా శ్రద్ధ చూపలేదు. బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో పనులు మందకొడిగానే సాగాయి. దీనికితోడు ప్రాజెక్టు పనులకు అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. వీటిని గత ప్రభుత్వం పరిష్కరించలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. ప్రాజెక్టు పనులు ఆగిపోవడానికి కారణమైన బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు, భూసేకరణ నిధులు వంటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించకపోవడంతో ప్రాజెక్టు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. పనులు పూర్తి కాకపోవడంతో, ప్రభుత్వం తాజాగా మరోసారి ఈ ఏడాది డిసెంబరు వరకు ఒప్పంద కాలపరిమితిని పొడిగించింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల అనుసంధానంలో భాగంగా హిరమండలం రిజర్వాయర్ గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి, అక్కడ్నుంచి 33.58 కిలోమీటర్ల మేర నారాయణపురం వరకు కాలువ తవ్వాల్సి ఉంది. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసే చోట 43.7 మీటర్ల స్థాయిలో, నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువ కలిసే చోట 29.09 మీటర్లు నిర్మించేలా డిజైన్ చేశారు. తద్వారా ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. నదుల అనుసంధానం పూర్తి చేస్తే ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఉన్న ఐదు వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీంతోపాటు నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కింద ఉన్న 37,053 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

పెరిగిన ప్రాజెక్టు వ్యయం

వంశధార, నాగావళి నదుల పనులను రూ.84.90 కోట్ల వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించినా, పనులు పూర్తి కాలేదు. అంచనా వ్యయాన్ని సవరించి రూ.145.34 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు రూ.106.32 కోట్లను వెచ్చించారు.

భూసేకరణ చెల్లింపుల్లో జాప్యం

హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయినా, ప్రభుత్వం నేటికీ రైతులకు డబ్బులు చెల్లించలేదని తెలుస్తోంది. కాలువ తవ్వకాలకు మరో 49.23 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించినా ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదు. ఇందుకోసం రూ.8.26 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది. అదీగాక వర్షాలు పడుతుండడం కూడా పనులు ముందుకు సాగడానికి కొంత ఆటంకంగా మారింది. కాంట్రాక్టర్‌కు రూ.1.31 కోట్ల మేర బకాయిలు చెల్లించకపోవడంతో, పనులు అర్థాంతరంగా ఆపేసి వెళ్లిపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

కాలువ పనులకు అడ్డంకిగా కోర్టు కేసులు

బూర్జ మండలం చినలంకాంలో కాలువ నిర్మాణం కోసం దేవాదాయ, ధర్మాదాయశాఖకు చెందిన సుమారు 7.5 ఎకరాలు అవసరం పడింది. వంశధార అధికారులు పరిహారం కింద దేవాదాయ, ధర్మాదాయశాఖకు రూ.1.50 కోట్లు చెల్లించేశారు. భూముల్లో 13 మంది రైతులు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. చట్టం ప్రకారం పరిహారంలో 60 శాతం దేవాదాయ, ధర్మాదాయశాఖకు, 40 శాతం కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. కౌలు రైతులకు పరిహారం చెల్లింపునకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ భూములకు దేవాలయానికి ఇచ్చిన ధర్మదాత పరిహారం ఇవ్వాల్సి వస్తే తనకు ఇవ్వాలని, లేకుంటే దేవాదాయశాఖకు చెందాలంటూ కోర్టును ఆశ్రయించాడు. దీంతో బూర్జ మండలం చిన లంకాం పరిధిలో 700 మీటర్ల మేర కాలువ తవ్వకాలకు బ్రేక్ పడింది. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గంలో కాలువ నిర్మిస్తామని అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం చొరవ చూపి సమస్యలను పరిస్కరిస్తే, వంశధార-నాగావళి అనుసంధానం పనులు త్వరితగతిన పూర్తయి రైతుల కల నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.



మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన

మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో ఇవాళ రాజ్యాంగబద్ధంగా పాలన జరగడం లేదని వైసిపి సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. నగరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ విస్తృతస్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన పాలన అందరికీ అందాలి, సంపద అందరికీ అందించాలన్న ఉద్దేశంతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లు పరిపాలించారని తెలిపారు. రూ.లక్ష కోట్లు ఒక రాజధానికి పెడితే మిగిలిన ప్రజలు, ప్రాంతాలు ఏం కావాలి, మళ్లీ వచ్చిన ప్రభుత్వాలు ఆ రూ.లక్ష కోట్లు అప్పు తీర్చే పనిలో ఉండాలా అని ప్రశ్నించారు. రాజ్యాంగంలో ఇది చెప్పలేదని తప్పుపట్టారు. కష్టపడేతత్వం, చిత్తశుద్ధితో పనిచేస్తే అవకాశాలు తప్పక వస్తాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే సంపూర్ణ నాయకునిగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లేదని, టిడిపి ప్రభుత్వం మాత్రమే నడుస్తోందన్నారు. రెడ్‌బుక్ పేరుతో వేరొక రాజ్యాంగాన్ని రూపొందించుకొని ప్రశ్నిస్తున్న వైసిప నేతలను వేధించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు.

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతం చిన్న వర్షానికే చెరువులను తలపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు సోషల్ మీడియా ద్వారా బయటకు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని, నిజాన్ని నిర్భయంగా వెలికితీయాలని పిలుపునిచ్చారు. రైతులకు యూరియా ఇమ్మంటే.. వాడకం తగ్గించాలని, నానో ఎరువులు వాడాలని సమావేశాలు పెడుతున్నారని విమర్శించారు. దళితులకు అండగా వైసిపి ఉంటుందన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ పి-4 విధానంతో ప్రభుత్వ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే టి.జె.ఆర్ సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, నాయకులు చింతాడ రవికుమార్, దుంపల రామారావు, అంధవరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 6 నుంచి 18 ఏళ్ల వికలాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేయడానికి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.శశిభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో అర్హులైన విద్యార్థులను గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19న ఇచ్ఛాపురం ప్రభుత్వ జిహెచ్‌లో, 20న కాశీబుగ్గ జెడ్‌పిహెచ్ఎస్, 22న టెక్కలి ఓక్లాండ్ స్కూల్, 23న పాతపట్నం ఎంపిపిఎస్‌లో, 24న శ్రీకాకుళం జిసిహెచ్ఎస్‌లో, 25న ఆమదాలవలస మార్కెట్ కమిటీ కార్యాలయంలో, 26న నరసన్నపేట ఎంఆర్‌సిలో, 27న రణస్థలం జెడ్‌పిహెచ్ఎస్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికేట్, యుడిఐడి, రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువపత్రం, విద్యార్థి ఫొటోతో హాజరు కావాలని సూచించారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉపకరణాలు అందజేయనున్నట్లు తెలిపారు.



స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ ప్రతిజ్ఞ చేస్తున్న జెసి, ఎమ్మెల్యే

స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌ను ప్రభుత్వం సర్వజన ఆస్పత్రి ఆవరణలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, బిపి, షుగర్ తదితర ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యకరమైన జీవనానికి ఈ పథకం తోడ్పడుతుందని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుంటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉన్నట్లేనని చెప్పారు. కేన్సర్ వంటి వ్యాధులు ముందుగా గుర్తిస్తే నియంత్రణ సాధ్యమన్నారు. ప్రతి మహిళా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ నరసింగరావు, ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్ పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి

ప్రజాశక్తి- బూర్జ

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.శివకుమార్ నాయుడు, ప్రధాన కార్యదర్శి దార రాంబాబు, మండలశాఖ నాయకులు జిఎన్ బట్లుతో పాటు ఇతర కమిటీసభ్యులు మండలంలోని ఉప్పినవలస, ఒవిపేట, బూర్జ, పాలవలస, తోటవాడ, మామిడివలస గ్రామాల్లోని జడ్‌పిహెచ్ హైస్కూళ్లు, మోడల్ స్కూళ్లను సందర్శించి సమస్యలను సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 30శాతం ఐఆర్‌ను చెల్లించాలని, ఇప్పటివరకు ఉన్న నాలుగు పెండింగ్ డిఎలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేయాలని, 57 మెమోను అమలు చేయాలని, బోధనేతర కార్యక్రమాలను విరమించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 25న గుంటూరులో జరిగే యుటిఎఫ్ రణభేరి మహాసభను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమావేశంలో కె.తిరుపతిరావు, జి.సంతోష్ కుమార్, పి.సురేష్ కుమార్, బి.నారాయణరావు, ఆర్.జగదీశ్వర్, కె.ప్రవీణ్ ఉన్నారు.



మాట్లాడుతున్న గిరిధర్

ప్లాస్టిక్ రహిత జిల్లా లక్ష్యం

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్లాస్టిక్ రహిత జిల్లాగా మారే దిశగా శ్రీకాకుళం జిల్లా ముందుండాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. నగరపాలక కమిషనర్ ప్రసాద్ ఆధ్వర్యంలో 'మన ఊరు - మన బాధ్యత' అనే నినాదంతో మున్సిపల్ కార్యాలయం నుంచి సూర్యమహల్ కూడలి వరకు స్వచ్ఛతాహి సేవ ఉత్సవ్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, అక్టోబర్ రెండో తేదీ వరకు స్వచ్ఛత ఉత్సవాలు కొనసాగుతాయన్నారు.

ప్రతిఒక్కరూ చురుగ్గా పాల్గొని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ బాధ్యతతో ముందుకు వచ్చి ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలికి, పర్యావరణ హితమైన గుడ్డ సంచులను వినియోగించాలన్నారు. మొక్కలు నాటడం, వాటి సంరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు జూట్ సంచులు, గుడ్డ సంచులు పంపిణీ చేశారు. జిల్లా పర్యావరణ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన లయన్ పొన్నాడ రవికుమార్‌ను జాయింట్ కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్ కుమార్, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

22న పోస్టల్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి పోస్టల్ అదాలత్‌ను పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 22వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు సూపరింటెండెంట్ కార్యాలయం, రెల్లవీధి, ఎస్-ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్ సమీపంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టల్ సేవలకు సంబంధించిన ప్రత్యేక ఫిర్యాదులు ఈ అదాలత్‌లో చర్చించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినియోగ దారులు తమ ఫిర్యాదులను తపాల అదాలత్ అనే శీర్షికతో ఈనెల 22లోగా 'సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్, శ్రీకాకుళం 532001 చిరునామాకు పంపాలని కోరారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని స్పష్టం చేశారు. వినియోగదారులు తమ సమస్యలను వ్యక్తిగతంగా సమర్పించి అదాలత్‌కు హాజరు కావచ్చని తెలిపారు. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ ఉండదని స్పష్టం చేశారు.

21న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 21వ తేదీన ఉదయం 10.30 గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్‌రాజా ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు. సమావేశానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని జిల్లా పారిశ్రామిక శిక్షణ కేంద్రం (డిఎల్‌టిసి)లో బుధవారం నిర్వహించిన కాన్వకేషన్-2025లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఐటిఐలో చదువుతున్న విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా అవకాశాలను అందిపుచ్చుకోవడం అభినందనీయమన్నారు. మరింత నైపుణ్య శిక్షణ అందిపుచ్చుకుని అన్ని ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలను పొందాలని సూచించారు. ప్రస్తుతం పరిశ్రమలు విస్తరిస్తున్నాయని, క్షేత్రస్థాయిలో నైపుణ్య వర్కర్ల కొరత ఉందని చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు అవసరంగా చెప్పారు. ప్రభుత్వం ఐటిఐల కేంద్రంగా స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేస్తుందని, ఈ హబ్‌ల్లో నైపుణ్య శిక్షణలు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎడి వై.రామ్మోహనరావు, చిట్టి నాగభూణం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

బంగారు కుటుంబాల మ్యాపింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జీరో పావర్టీ పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగి 20, 25 బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేసి, ఆ కుటుంబాలకు లభిస్తున్న ప్రభుత్వ ప్రయోజనాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ పనిని ఈనెల 30వ తేదీ లోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సిపిఒ ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన బుధవారం శిక్షణా కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా ప్రధాన ప్రణాళికాధికారి, పీడీ, డిఆర్‌డిఎ, డిఒ సోషల్ వెల్ఫేర్, ఎస్ఇ సుడా, యంగ్ ప్రొఫెషనల్స్, సియు ఎపి, డిఎపి బృందాలు పాల్గొన్నారు.

ప్రతి మండలం నుంచి ఎంపికైన 12 మంది జిఎస్‌డబ్ల్యుఎస్ సిబ్బంది పాల్గొన్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు 23, 24వ తేదీల్లో మండలాల్లోని సచివాలయ ఉద్యోగులందరికీ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి పర్యవేక్షకులు సాంకేతిక నిపుణుడు శ్రీనివాస్, ఎమ్‌డి లతీఫ్ పర్యవేక్షించారు.

ఆంధ్ర యువ 2కె25 అంబాసిడర్ కోసం డిజిటల్ రేస్

శ్రీకాకుళం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం యువతను భాగస్వామ్యంగా చేసుకుంటూ 'ఆంధ్ర యువ సంకల్ప్ 2కె25 అంబాసిడర్' డిజిటల్ మారథాన్ కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తోందని సెట్‌శ్రీ సిఇఒ వి.వి అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా సామాజిక బాధ్యత, కుటుంబ బాంధవ్యాలు, ఆరోగ్యకర జీవన విధానాలు, బాధ్యతాయుత డిజిటల్ ఆవిష్కరణలు వంటి అంశాలను ప్రోత్సహించేందుకు ఈవెంట్లు, థీమ్స్‌ను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల యువత www.andhrayuvasankalp.comలో నమోదు చేసుకోవాలని సూచించారు. పాల్గొనే వారు స్వయంగా 120 సెకన్ల నిడివి గల వీడియో లేదా షార్ట్ ఫిల్మ్ తయారు చేసి, తమ సోషల్ మీడియా ఖాతాల్లో అధికారిక హ్యాష్ ట్యాగ్‌లతో పోస్టు చేయాలని సూచించారు. జ్యూరీ ఎంపిక చేసే ఉత్తమ ఎంట్రీలకు మొదటి మూడు స్థానాలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు దీంతోపాటు తొమ్మిది మంది విజేతలకు ఆంధ్ర యువ సంకల్ప్ 2కె25 అంబాసిడర్ గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పోటీలో పాల్గొనే ప్రతిఒక్కరికీ సర్టిఫికెట్‌ను అందజేస్తామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు

చదువుతో పాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి- పలాస

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించే అవకాశం ఉందని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎపిటిపిసి చైర్మన్ వజ్జి బాబూరావులు అన్నారు. మండలంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి.రవికుమార్ యోగా పోటీలను ప్రారంభించారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చిన్నంనాయుడు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశంలో వీరు పాల్గొని మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు కూడా అంతే అవసరమని అన్నారు. ఎంతో మంది నిరుపేద కుటుంబాలు క్రీడాల్లో రాణించి ఉన్నత శిఖరాలు అవరోధించిన విషయాలను మనం రోజూ తెలుసుకుంటున్నామన్నారు. అందుకోసం ప్రతి విద్యార్థి క్రీడల కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్‌రావు, బడ్డ నాగరాజు, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సాంకేతిక కమిటీ చైర్మన్ కె.హరిబాబు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు పి.తవిటయ్య, మొదటి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.పి.రెడ్డి, గజేంద్రరావు, సిహెచ్.పద్మలోచన ఎస్.రామారావు, జి.లోకేష్, జె.నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు బి.రవికాంత్, వై.కె.హరినాథ్, టి.గణేష్ పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలు ప్రదర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్థానిక పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. ఇండిజీనియస్ సొసైటీ ఫర్ ప్రోగల్ సైన్స్ ఇన్వెన్షన్ సొసైటీ సౌజన్యంతో సైన్స్ వైబ్రేషన్స్ అనే పేరుతో నిర్వహించిన ఈ ప్రదర్శనను జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ ఎం.ప్రదీప్ కో-ఆర్డినేటర్స్ డాక్టర్ ఆర్.హరిత, పి.సుధారాణి, శివాల రవిబాబు, కె.అపర్ణ ఇతర సిబ్బంది, విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం అలవాటు పడాలన్నారు. తోటి విద్యార్థులను, గురువులను, కుటుంబ పెద్దలను ఎందుకు, ఏమిటి ఎలా, అని ప్రశ్నిస్తూ, నేర్చుకోవాలన్న ఉత్సుకతను ప్రదర్శించాలన్నారు. ప్రశ్నించేతత్వంతో పాటు, సైంటిఫిక్ టెంపర్‌ను అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమ నిర్వహణ కర్త డాక్టర్ ఎం.ప్రదీప్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ తరపున హరిత, పోలినాయుడులను సన్మానించారు.



ధర్నా చేస్తున్న డ్రైవర్లు

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

స్త్రీశక్తి పథకం వల్ల నష్టపోతున్న ఆటో, క్యాబ్ మ్యాక్సీ డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. సిఐటియు ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆటో, టాక్సీ, క్యాబ్ నియోజకవర్గ కన్వీనర్ కాల నరసింహ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకంతో డ్రైవర్లకు ఆదాయం తగ్గిపోయిందని, దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు డ్రైవర్లకు రూ.30 వేలు చెల్లించాలన్నారు. జిఒ నంబరు 21ను రద్దు చేసి ఆటోడ్రైవర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డ్రైవర్లు డి.ఉమ, యు.శ్రీనివాసరావు, జి.వెంకటేష్, డి.రమేష్, కె.చిరంజీవి, కర్రి ఢిల్లేశ్వరరావు, పూతి రాంబాబు, బాల సుబ్బారావు, వరకవి బాలకృష్ణ, మోహనరావు, డి.రమణారావు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

డిజిటల్ చెల్లింపులపై అవగాహన

టెక్కలి రూరల్: టెక్కలి ఐతమ్ కళాశాలలో బుధవారం ఎంబిఎ విద్యార్థులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ చెల్లింపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యాన ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహిస్తూ, డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ వర్క్‌షాప్‌కు లీడ్ జిల్లా మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డిజిటల్ చెల్లింపుల పద్ధతులను అలవాటు చేసుకోవాన్నారు. నగదు రహిత లావాదేవీల ద్వారా పారదర్శకత పెరుగుతుందన్నారు. బ్యాంకింగ్ సౌకర్యాలను వినియోగించుకోవడం ద్వారా ఆర్థిక భద్రత కలుగుతుందని తెలిపారు. అందరూ బ్యాంకు ఉత్పత్తులు, సేవలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి టి. నాగరాజు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, హెచ్ఒడి ప్రొఫెసర్ బి.శివకుమార్, ప్రొఫెసర్ కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

డిఎల్‌డిఒగా శైలజ

పలాస: పలాస డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి బొడ్డేపల్లి శైలజ బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అమె శ్రీకాకుళం ఎంపిడిఒగా పనిచేసి పదోన్నతిపై పలాస డిఎల్‌ఒగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డిఎల్‌డిఒ ఇన్‌ఛార్జీ బాధ్యతలను వజ్రపుకొత్తూరు ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు పనిచేశారు. శైలజకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, వజ్రపుకొత్తూరు ఎంపిడిఒ రమేష్‌నాయుడు, మండల పరిషత్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం



నరసన్నపేట : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తున్నట్లు రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ పి.ఈశ్వరరావు అన్నారు. జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలో చౌదరి సత్యనారాయణ కాలనీలో నారీ శక్తి పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళా భద్రత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సైబర్ నేరాలు, శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాలు ద్వారా మహిళలు అనేక విధాలుగా సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి సైబర్ మోసాలకు గురవుతున్నారని, సామాజిక మాధ్యమాలు ద్వారా వచ్చే ఎటువంటి తప్పుడు వదంతులు నమ్మరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ఆపద సమయంలో శక్తి యాప్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అత్యవసర సమయంలో శక్తి యాప్ ఎస్ఒఎస్, డయల్ 112 నెంబర్ ద్వారా సమాచారం అందించాలన్నారు.

రణస్థలం: జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు పాఠశాలలు, కళాశాలలు, పలు గ్రామాల్లో నారీశక్తి కార్యక్రమంలో భాగంగా మండలంలోని మరువాడ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్.చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకుని తల్లిదండ్రుల కళలను నిజం చేయాలన్నారు. ముఖ్యంగా మహిళా చట్టాల కోసం తెలుసు కోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.శివశంకర్, ఉపాధ్యాయులు ఎస్.రహీం, టి.సురేష్, కె.ఖగేశ్వరరావు, హరినాథ్, జి.చిన్ని కృష్ణంనాయుడు, వై.ప్రమీల, పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి మండల కేంద్రంలోని ఎస్‌విఆర్ కళాశాలలో ఎస్ఐ-2 రఘునాథరావు బుధవారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. శక్తి యాప్ ఉపయోగాలు, పనిచేసే విధానం విద్యార్థులకు వివరించారు. హెచ్‌సి గిరిధర్ ఆధ్వర్యాన శక్తి టీం సభ్యులు యాప్ పనితీరుపై డెమోరూపంలో విద్యార్థులు వివరించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ మెట్ట మోహనరావు, డైరెక్టర్ కొసంటి శ్రీనివాసరావు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

కవిటి: ఈగల్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సంతోష్, మండలంలోని ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని, కుటుంబానికి ఆర్థిక, సామాజిక సమస్యలు తెస్తాయని వివరించారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల చట్టపరంగా తీవ్ర శిక్షలు ఉంటాయని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలంటే ఇలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, స్నేహితుల ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా 'నో' చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రణస్థలం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చిరంజీవి

నరసన్నపేట: మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, కష్టపడి చదువుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఎస్ఐ శంకరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.లత అధ్యక్షతన సంకల్పం సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సరైన మార్గంలో నడుచుకొని ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు, మీకు మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జి.రవికుమార్, అన్నాజీరావు, త్రినాథరావు, పవిత్ర, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఇచ్ఛాపురం : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 'స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కింద గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.నీలిమ పర్యవేక్షిస్తారని అన్నారు. ఈ శిబిరంలో ప్రసూతి, చిన్నపిల్లలు, దంత, చెవి, ముక్కు, గొంతు, నేత్ర, మానసిక వైద్యులు పాల్గొంటారని తెలిపారు. ఉచితంగా మందులను పంపిణీ చేస్తామన్నారు. రోగులను ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- పొందూరు

శ్రీకాకుళం కోడిరామ్మూర్తి ఇండోర్ స్టేడియంలో డివిజనల్ స్థాయిలో నిర్వహించిన యోగాసన పోటీల్లో రాపాక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి జిల్లాస్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో జామాన కావ్య, కొంచాడ రాజేశ్వరి, అండర్-17 విభాగంలో మెండ రేణుక, పోతురాజు ప్రసన్నలు జిల్లాస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సిహెచ్ శారదాంబ, వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లా రమణమ్మ తెలిపారు. విద్యార్థులను ఎస్ఎంసి ఛైర్మన్ కొంచాడ శేషగిరిరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వైద్య శిబిరానికి స్పందన

పోలాకి: మండలంలోని చెల్లాయివలసలో రాజరాజేశ్వరి మెడికల్ స్టోర్ ఆధ్వర్యాన బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మెడికవర్ వైద్యులు స్వాతి, కోటి 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే మోక్ష బ్లడ్ బ్యాంకు నరసన్నపేట ద్వారా తర్ర శ్యామ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. 17 మంది యువకులు పాల్గొన్ని రక్తదానం చేశారు. బోర వెంకటరావు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి బట్న రామారావు, చింతు రామకృష్ణ, టెంక వినోద్, కోట ప్రసాద్, అంధవరపు వెంకటరమణ, దుద్దు కృష్ణ, బమ్మిడి రాము పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

టెక్కలి: మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, తృతీయ స్థానాల్లో ప్రతిభ కనపరిచారని ప్రధానోపాధ్యాయులు టి. పద్మావతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వారధి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యాన బుధవారం జిల్లాస్థాయి నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన సుంకర ఉదయశ్రీ వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సంపాదించగా, పండ వక్తృత్వ పోటీల్లో తృతీయ స్థానాన్ని సంపాదించారని తెలిపారు. విజేత విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, చిన్నారావు, రమాదేవి, లక్ష్మణరాజా పాల్గొన్నారు.

లక్ష్మీపురం పాఠశాల విద్యార్థుల ఇక్కట్లు

సంతబొమ్మాళి: మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు మొత్తం 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకు రెండు భవనాలు ఉన్నాయి. ఒకటి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మూసివేశారు. ప్రస్తుతం చిన్న డిపిఇపి భవనంలో కొంతమంది విద్యార్థులు, మిగిలిన వారు సమీపంలోని ఒక ప్రయివేట్ ఇంటి గడపలో తరగతులు నిర్వహిస్తున్నారు. వర్షం పడితే గడపలోకి కూడా నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయంపై హెచ్‌ఎం రెడ్డి సూరిబాబు విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి పాఠశాలకు కొత్త భవనం మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వర్షపు నీరు చేరడంతో ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు

సిసి రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన


సిసి రహదారులకు శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాకలో సిసి రహదారుల నిర్మాణానికి బుధవారం జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, మండల తెలుగుయువత అధ్యక్షులు కండాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రత్యేక చొరవతో పంచాయతీ పరిధిలో సుమారు రూ.3.09 కోట్లు ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో సిసి రహదారులు, కాలువల నిర్మాణ పనులను మంజూరు చేశారని తెలిపారు. రాపాక గ్రామానికి రూ.1.50 కోట్లు, వావిలపల్లిపేటకు రూ.81 లక్షలు, ఇల్లయ్యగారిపేటకు రూ.78 లక్షలతో ఈ పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా రాపాకలోని జంగం సెంటర్ నుంచి చిన్న చెట్టువరకూ రూ.31 లక్షలతో, పిసిని లక్ష్మణరావు ఇంటి నుంచి కొంచాడ శ్రీరాములు ఇంటి వరకూ రూ.8.5 లక్షలు, తెండేల అప్పన్న ఇంటి నుంచి వరలక్ష్మి పేరంటాల గుడివరకూ రూ.3.5 లక్షలతో సిసి రహదారులు, కాలువల నిర్మాణాలు జరపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన జిల్లా సెక్రటరీ కొంచాడ చిన్నంనాయుడు, కూటమి నాయకులు కొంచాడ గొల్లయ్య, పారంనాయుడు, నరేష్, శేషగిరి, మనోహరరావు, సన్యాసిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక ఎంపిడిఒగా సాహిని వాసుదేవరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆమదాలవలస ఎంపిడిఒ కార్యాలయం ఎఒగా పనిచేసి ఎంపిడిఒగా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు డిప్యూటీ ఎంపిడిఒ పి.సింహాచలం, ఎపిఒ పైల శ్రీనివాసరావు, కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

జలుమూరు : జలుమూరు ఎంపిడిఒగా చిన్నమ్మడు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈమె సారవకోట మండల పరిషత్ కార్యాలయంలో ఎఒగా పనిచేస్తూ... ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొంది ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇఒపిఆర్‌డిఒ ఉమామహేశ్వరరావు బాధ్యతలు నిర్వహించారు. ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎంఇఒ మాధవరావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని ఎంపిడిఒ తెలిపారు.


పొందూరు : ఎంపిడిఒకు అభినందనలు తెలియజేస్తున్న సెక్రటరీలు, సిబ్బంది

టెక్కలి రూరల్ : టెక్కలి ఎంపిడిఒగా మొజ్జాడ రేణుక బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నరసన్నపేట డిప్యూటీ ఎంపిడిఒగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది, ఎపిఒ బగాది ప్రసాదరావు ఆధ్వర్యాన ఫీల్డ్ అసిస్టెంట్లు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


ఈశ్వరరావు మృతదేహం

సోంపేట : మండలంలోని పాలవలసకు చెందిన పి.ఈశ్వర రావు (45) అనే రైతు బుధవారం సాయంత్రం పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. బారువ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈశ్వరరావు సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో తన వ్యవసాయం పొలం వద్ద బోరు వేసేం దుకు విద్యుత్ బోర్డు వద్దకు వెళ్లాడు. అప్పటికే విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యా డు. పరిసరల్లో ఉన్న రైతులు గమనించి 108కి సమాచారం అందజేశారు. సిబ్బంది వచ్చి పరిశీలించగా, అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న సోంపేట సిఐ మంగరాజు, బారువా ఎస్ఐ హరిబాబు నాయుడు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఉష, కుమారుడు చరణ్, కుమార్తె స్నేహ ఉన్నారు.


గంజాయితో పట్టుబడిన నిందితులు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న సమయంలో మండలంలోని తోటవూరు వద్ద ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. అనంతరం మాట్లాడుతూ ఒడిశా నుంచి తెచ్చిన గంజాయిని తమిళనాడు రాష్ట్రంలో అప్పగించేందుకు తమిళనాడు తూతుకూడికి చెందిన కంద శివకుమార్, కపిల్ దేవ్ మరిప్పన్ 11.120 గంజాయిని తరలిస్తున్నారని అన్నారు. తోటవూరు రైల్వే ఎల్‌సి గేటు వద్ద రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్టు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశామన్నారు.


ప్రారంభిస్తున్న రాజేష్

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఇద్దివానిపాలెంలో జనసేన పార్టీ కార్యాలయం గ్రామ జనసైనికులు, గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం ప్రారంభమైంది. బైపల్లి దానయ్య మాస్టర్ ఆధ్వర్యాన జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యాలయం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాలు, పల్లెల్లో కూడా జనసేన కార్యాలయాలు ఏర్పాటవడం శుభ పరిణామమని అన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండే ఈ కార్యాలయం ద్వారా సేవలు పొందాలని పంచాయతీ ప్రజలకు పిలుపునిచ్చారు. జనసేన అభివృద్ధికి కృషి చేసిన గ్రామ నాయకులు, ముఖ్యంగా బైపల్లి దానయ్య మాస్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ నాయకులు, జనసైనికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అక్రమ నిర్మాణం

ఫిర్యాదు చేసినా స్పందన లేదు

శ్రీకాకుళం సిటీ: అక్రమ కట్టడంపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందన లేదని సంఘ సేవకులు మణికొండ ఆదినారాయణ మూర్తి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రధాన రహదారుల్లో ఒకటైన చౌకబజార్‌లో అక్రమ కట్టడం గతకొంత కాలంగా యథేచ్ఛగా జరిగిపోతున్నా, జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా కనీసం పట్టించుకోవడం లేదన్నారు. శివజ్యోతి హోటల్ ఎదురుగా దుర్గా జనార్ధనరావు నిర్మిస్తున్న ఈ బహుళ అంతస్తుల భవన నిర్మాణం నిబంధనలను బేఖాతరు చేస్తూ జరిగిపోతున్నా, అధికారులు కన్నెత్తి చూడడం లేదన్నారు. నాలుగువైపులా సెట్‌బ్యాక్‌లు (నిబంధనల ప్రకారం వదలాల్సిన ఖాళీస్థలం) వదలకుండా, నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణం జరుగుతుందని రాతపూర్వకంగా ఫిర్యాదు అందినా మిన్నకుండా ఉండడం వెనుక దాగివున్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నడిరోడ్డులోనే నిబంధనల ఉల్లంఘన బాహాటంగా జరుగుతుంటే, పట్టణ మారుమూల ప్రాంతాల్లో జరిగే అక్రమ కట్టడాలు ఏ స్థాయిలో ఉంటాయో అంటూ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేదంటే న్యాయ పోరాటం చేస్తానన్నారు.

జూనియర్ కళాశాల సందర్శన

కొత్తూరు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డివిఇఒ ఆర్.సురేష్ బుధవారం సందర్శించారు. ఈ మేరకు పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ గణపతి ధనుంజయ్‌రావు అధ్యాపక, అధ్యాపకయేతర బృందంతో సమావేశం నిర్వహించారు. అలాగే విద్యార్థుల క్రమశిక్షణ, నైపుణ్యం తెలుసుకున్నారు. విద్యార్థులను కాంపిటేటివ్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు.


తవ్వి వదిలేసిన కాలువ

తవ్వి వదిలేశారు

ఎచ్చెర్ల: మండల పరిధిలో కేశవరావుపేట పంచాయతీలో గల కనకమహాలక్ష్మి గుడి వద్ద నుంచి బుడ్డవాని చెరువుకి వెళ్లే రహదారి మార్గంలో గతేడాది ఆ రోడ్డు మార్గంలో ఉండే గృహాలకు డ్రైనేజీ సదుపాయం కోసం తవ్వకాలు జరిపారు. ఇప్పటివరకు ఆ డ్రైనేజీ నిర్మాణం పూర్తి కాకపోవటంతో అకాలవర్షాలు కురవడంతో ఆ నీరు ఎటూ వెళ్లకపోవడంతో పాటు ఆ కాలవలో మురుగునీరు చేరడంతో జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అలాగే పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డు కూడా బీటలు వాటిల్లిందని, అక్కడ ఉన్న బోరు కూడా కొన్నాళ్లుగా పనిచేయకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందు తున్నారు. తవ్విన కాలువలు పూర్తిచేయకపోవడంతో చిన్నపిల్లలు ఆ గోతిలో పడి గాయాల పాలవుతున్నారని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకుని డ్రైనేజీ పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పనిచేయని బోరు

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ



వాస్తు శాస్త్రం, శిల్పకళలకు అధిపతైన విశ్వకర్మ భారతీయ సంస్కృతిలో కళలు, చేతివృత్తులు, నిర్మాణాలకు ఆదిగురువని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ జయంతి సందర్భంలో ఆయుధాలు, పనిముట్లతో పాటు యంత్రాలకు కూడా పూజలు చేసే సంప్రదాయం ఉందన్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న జరుపుకునే ఈ పండుగను ముఖ్యంగా శిల్పులు, వడ్రంగులు, కమ్మర్లు, స్వర్ణకారులు వంటి చేతివృత్తుల వారు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారన్నారు. పిల్లలకు విశ్వకర్మ ప్రాముఖ్యతను తెలియజేయడం మన బాధ్యతని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ సృష్టికర్త బ్రహ్మకు సమానంగా దేవశిల్పి విశ్వకర్మ స్థానం పొందారని కొనియాడారు.

అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో దేవశిల్పి విశ్వకర్మ జయంతి నిర్వహించారు. జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి అదనపు ఎస్‌పి కె.వి రమణ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ ఆది గురువు విశ్వకర్మని, అలాంటి మహోన్నత వ్యక్తి విశిష్టతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు కార్యాయల పరిపాలన అధికారి సిహెచ్ గోపినాథ్, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీకాకుళం రూరల్: మండలంలోని సింగపురంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సృష్టికర్త బ్రహ్మకు సమమైన స్థానం పొందిన దేవశిల్పి విశ్వకర్మ అని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వకర్మ సభ్యులు పాల్గొన్నారు.

అలాగే మండలం చాపురం పంచాయతీ గోవిందపురంలో విశ్వకర్మ ఆలయ ఆవరణలో ఐదవ వార్షికోత్సవ వేడుకలు, విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సూర్యారావు, స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, బి వి రవిశంకర్, గుడ్ల జగ్గారావు, గేదెల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక వైసిపి క్యాంపు కార్యాలయంలో విశ్వకర్మ జయంతిని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు డోల వెంకట రమణ, వైసిపి రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, రాష్ట్ర అనుబంధ వాణిజ్య విభాగం జాయింట్ సెక్రటరీ, ఎంపిటిసి ప్రతినిధి పచ్చిగుల్ల సాయిరాం, టేకు బ్రహ్మాజీ, అదపాక ఉదయ కుమార్, నాగవరపు సత్యం, పిన్నింటి గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలో విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో విశ్వకర్మ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సింహాద్రీ ప్రసాద్ ఆచారి, ఎ.కృష్ణ ఆచారి, లింగం, అన్నాజీ ఆచారి, బి.ఎల్.రాజు, ఎస్.ఎన్.రావు, కె.బాలు, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలం విశ్వేశ్వర శివాలయం ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన అన్నదానం చేశారు.


మురుగు కాలువ సమీపంలో ఉన్న బోరు

చిగురుకొత్తపల్లిలో అపారిశుధ్యం

లావేరు: మండలంలోని చిగురుకొత్తపల్లి పంచాయతీలో అపారిశుధ్యం తాండవిస్తుంది. గ్రామంలో ఏ వీధిలో, కాలువలో, కొళాయి, బోర్లు, నివాసాలు వద్ద చూసినా దుర్గంధంతో పేరుకుపోయిన పూడికలే దర్శనమిస్తున్నాయి. దోమలు, ఈగలతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలకు ఆనుకుని తాగునీటి కొళాయిలు, బోర్లు ఉండడంతో మురుగునీరు, భరించలేని దుర్గంధపు వాసనతో ఆ బోరు నీటినే గ్రామస్తులు తాగుతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగునీరు, దుర్వాసనతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడంపై గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని, పూడికలు తొలగించి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కాలువల్లో పేరుకుపోయిన పూడికలు


శంకుస్థాపన చేస్తున్న గిరిబాబు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో రూ.23 లక్షలు నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్లు, కాలువ నిర్మాణ పనులను ఎపిటిపిసి చైర్మన్ వజ్జి బాబూరావుతో కలిసి బుధవారం శంకుస్థావన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 15 ఆర్థిక సంఘం నిధులతో మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. కొన్ని వార్డుల్లో పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. ఆయా కాంట్రాక్టర్లతో చర్చించి అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగే విధంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, డొక్కరి శంకర్ రవిశంకర్ గుప్తా, పైల చక్రధర్, గాలి కృష్ణారావు, చిన్ని బి.నాగరాజు పాల్గొన్నారు.


ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని నాలుగో వార్డు కసింవలసలో బుధవారం శ్రీకాకుళం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఆక్రమణలు తొలగించారు. సర్వే నెంబరు 88/ 10లో గల ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తి ఆక్రమించుకొని కంచె ఏర్పాటు చేశాడు. మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ భూమి ఆక్రమణపై సాధు సుందరరావు, మరికొంతమంది ఫిర్యాదు చేయడంతో ఆక్రమణలు తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి తెలిపారు. ఈ ఆక్రమణ తొలగింపులో టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు శ్రీకాకుళం రెవెన్యూ సిబ్బంది, శ్రీకాకుళం రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణ చేస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

బస్సు సమయాన్ని మార్పు చేయాలి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లాకు సాయంత్రం సమయంలో విద్యార్థులు వెళ్లే బస్సు సమాయాన్ని మార్పు చేయాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పలాస నుంచి బ్రాహ్మణతర్లా వెళ్లేందుకు సాయంత్రం 4 గంటలకు బస్సు బయలుదేరుతుందని అన్నారు. విద్యాసంస్థల్లో సాయంత్రం ఐదు గంటలు వరకు తరగతులు కొనసాగించి విడిచిపెడుతున్నారని అన్నారు. దీంతో 4 గంటల బస్సుకు అందుకోలేకపోతున్నామని వివరించారు. అందుకు ఐదు గంటల తరువాత బస్సు వేయాలని విన్నవించారు. తహశీల్దార్ స్పందించి పలాస ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎం.ఎస్.ఎన్.నాయుడుతో ఫోన్ మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా కళాశాలలు అనంతరం ఆయా ప్రాంతాలకు బస్సులు నడిపేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో మేనేజర్ సానుకూలంగా స్పందించి దీనిపై తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.


విద్యార్థుల పోస్టర్లు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, అధ్యాపకులు

పరిశోధనా విద్యకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

విద్యార్థులు పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యత నివ్వాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్యచంద్రరావు అన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో బుధవారం మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ లలిత ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ సూక్ష్మజీవాల దినోత్సవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయించారు. విద్యార్థులు నిర్వహించిన మినీ ప్రాజెక్ట్స్ - రిఫ్రిజిరేటర్‌లో ఉండే బ్యాక్టీరియా, ఇండోర్, అవుట్ డోర్ సూక్ష్మజీవాలు, మొబైల్ ఫోన్స్ వాడకంలో బ్యాక్టీరియా పెరుగుదల, వాటి శుభ్రత, హ్యాండ్ వాష్‌కి ముందు, తర్వాత ఉండే బ్యాక్టీరియా సంఖ్య, చేతులు కడగడం వల్ల ఎలా తగ్గుముఖం పడతాయి, తాగునీటి పరీక్షలు, సింథటిక్ డ్రగ్స్ బదులుగా ప్రోబయాటిక్ ఫుడ్ వాడకం, వాటి ఉపయోగాలు తదితర అంశాలపై విద్యార్థినులు వివిధ రకాల చార్ట్‌ల ద్వారా వివరించారు. విద్యార్థుల పోస్టర్లు ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం ప్రారంభం

ఆమదాలవలస: మండలంలోని తోటాడలో ప్రభుత్వం ఆదేశాల మేరకు 'స్వస్త నారీ - స్వశక్ పరివార్' పేరుతో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని దూసి వైద్యాధికారి సిహెచ్ మాధురి ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా గ్రామీణ మహిళలు కుటుంబాలకు అవసరమైన ఆరోగ్య సేవలు, వైద్య పరీక్షలు తదితర అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్య సంరక్షణ, పోషణ, రక్తపోటు, మధుమేహం, ప్రసూతి ముందు తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు అందించారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు బుడుమూరు సీతారాం, ఎంఎల్‌హెచ్ పూజిత, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వైద్యాధికారి మాధురి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

రక్తదాతలు ప్రాణదాతలు

ప్రజాశక్తి- పలాస

ఆపద సమయంలో ఒకరికి రక్తం సకాలంలో అందించడం వల్ల ప్రాణదాతలుగా నిలుస్తారని సూర్యతేజ కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ దానేటి పద్మజ కామేశ్వరరావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా స్థానిక సూర్యతేజ కళాశాలలో రక్తదాన్ అమత్ మహోత్సవ్‌ను బుధవారం నిర్వహించారు. ప్రాణదాత బ్లడ్‌బ్యాంకు సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించి 46 యూనిట్లు రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దానేజి పద్మజ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ఎంతో మందికి కాపాడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ వజ్జ మురళీరాం, కోనారి చిరంజీవులు పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ రక్తదాన శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ దృష్టి ఉండాలన్నారు. టెక్కలి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సిబ్బందిచే నిర్వహించిన ఈ శిబిరంలో 35 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్ కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒలు డి.వాసుబాబు, వి.లూక్పాల్ కందిగొల్ల, కో-ఆర్డినేటర్ సిహెచ్.రాంబాబు, బి.సునీత పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ఒకరు చేసిన రక్తదానం ముగ్గురు ప్రాణాలను వేర్వేరు దశల్లో కాపాడుతుందని డా. బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ, జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రి రక్తనిధి కేంద్రంతో కలిసి డా. బిఆర్ఎయు ఎన్.ఎస్.ఎస్. శాఖ రక్తదాన అమృత మహోత్సవ్-2' కార్యక్రమాన్ని క్యాంపస్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణం కోసం రక్తదానానికి ప్రతీ ఒక్కరూ ముందుకు


టెక్కలి : రక్తదానం చేస్తున్న యువకులు

రావాలని కోరారు. రానున్న గాంధీ జయంతి వరకూ జరిగే స్వస్త నారీ, స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం విజయవంతానికి అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డా. ఎస్. ఉదయ భాస్కర్, డా. ఎం.అనురాధ, డా.సిహెచ్ రాజశేఖరరావు, వర్సిటీ ఎన్.ఎస్. ఎస్. కో- ఆర్డినేటర్ డా.డి.వనజ, వివిధ ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు పిఒలు, రిమ్స్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు డా. గోవింద, డా. ఎం.శ్యామలి, పి.చైతన్యకుమార్, జి.రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 60 యూనిట్లు రక్తాన్ని సేకరించారు.


కళాకారులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న ఏకపాత్రాభినయం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బి.గొనవపుట్టుగ ప్రజా నాట్యమండలి కళాకారుడు లోకనాథం 'విద్యార్థి మేలుకో' అనే ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. విద్య ప్రాముఖ్యత, క్రమశిక్షణ, సమాజపై బాధ్యత వంటి అంశాలను ప్రతిబింబించిన ఈ ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. అనంతరం ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు అప్పల నరసమ్మ, ప్రైమరీ ప్రధానోపాధ్యాయులు బల్లెడ లక్ష్మణమూర్తి ఆధ్వర్యాన కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, నాయకులు

ప్రజాశక్తి- కవిటి

కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే దేశం బలపడుతుందనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని బెలగాం పిహెచ్‌సి వైద్యులు రాకేష్ ఆచారి తెలిపారు. 'స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' పేరుతో ఈ నెల బుధవారం నుంచి మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మండలంలోని బెలగాం పిహెచ్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ ఆచారి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు (బిపి, సుగర్, కేన్సర్ తదితరాలు) చేయనున్నట్టు తెలిపారు. పల్లె దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్), జిల్లా ఆస్పత్రులు, బోధనాస్పత్రుల పరిధిలో ఈ సేవలు అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, జెడ్ఆర్ యుసిసి మెంబరు శ్రీనివాస రౌళో, నాయకులు బాసుదేవ్ రౌళో, సంతోష్ పట్నాయక్, ఎం.ఈశ్వరరావు, ల్యాబ్ అసిస్టెంట్ బెందాళం శివప్రసాద్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని వజ్రపుకొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రిచర్డ్ బూన్ అన్నారు. డోకులపాడు సచివాలయంలో నిర్వహించిన స్వస్త నారీ సశక్త పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డీ కరుణాకర్, మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, వైద్యాధికారి ఫణిమాధవి, సిహెచ్ఒ ఈశ్వరమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ చక్రధరరావు, లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌సి సంధ్య, జ్యోతి, రాధ, రమణ, ఆశా కార్యకర్తలు అరుణ, శాంతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.


కవిటి : హిందీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

హిందీ భాష నేర్చుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బి.జి.పుట్టుగ ఉన్నత పాఠశాలలో బుధవారం హిందీ దివస్ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు హిందీ శ్లోకాలు, పద్యాలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు డిక్కల వెంకట రమణను సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు వీరభద్రరావు మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యత వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థీ జాతీయ భాష హిందీ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: భారత జాతీయోద్యమంలో హిందీ భాష ప్రముఖ పాత్ర పోషించిందని ప్రధానోపాధ్యాయులు టి.హిమారావు అన్నారు. నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ పక్షోత్సవాలలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా హిందీ కవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. హిందీ అ అక్షరం ఆకారంలో విద్యార్థుల మానవహారం అలరించగా, విద్యార్థులు హిందీ బాషపై ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం హిందీ ఉపాధ్యాయులు వై.కాళిదాసు, ఎస్.గౌరీనాయుడులను సన్మానించారు.

పలాస : మండలంలోని రంగోయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు బొడ్డు చిన్నారావు, మురళీధర్‌లకు ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ రమేష్ సన్మానించారు.

రణస్థలం రూరల్: జాతీయ హిందీ పక్షోత్సవం సందర్భంగా హిందీ మంచ్ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు ఆధ్వర్యంలో బుధవారం ఎంపియుపి స్కూల్‌లో హిందీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాఠశాల నుంచి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెచ్ఎం ఆర్‌విబి సాయిరాం కుమార్ మాట్లాడుతూ హిందీ మంచ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు హిందీ భాషపై మక్కువ పెంచే కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు రామారావును సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 2004 నుంచి హిందీ ప్రచార కార్యక్రమాలను సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పలు హిందీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు ఎం.లలితమ్మ, ఎం.దీప్తి, ఎస్.నాగమణి, కె.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి

ఇచ్ఛాపురం : పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఎంపిపి బోర పుష్ప కోరారు. ఈ మేరకు రోడ్లు భవనాలుశాఖ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లపై వాహనాలు రాకపోకలు అతివేగంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల, పంచాయితీరాజ్ ఇంజినీరింగ్, నీటిపారుదల కార్యాలయాల మీదుగా 24 గంటలూ ప్రజలు రాకపోకలు, ఇతర ద్విచక్ర వాహనాలు, బస్సు వస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కె.వి పార్వతీశంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి కృష్ణాపురం, 11 కె.వి పూజారిపేట ఫీడర్లపై ఎంపీలాడ్స్ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని కృష్ణాపురం, విద్యానగర్, పెంటయ్య క్వార్టర్స్, దాలినాయుడు క్వార్టర్స్, ఎల్ఐసి ఆఫీస్, కోర్టు రోడ్డు, మున్సిపల్ ఆఫీసు రోడ్డు, చంద్రయ్యపేట, మెయిన్ రోడ్, బాలాజీ నగర్, వినాయక వీధి, పూజారిపేట, ఐజె నాయుడు కాలనీ, మోణింగి వారి వీధి, వరద వారి క్వార్టర్స్, రెడ్డి క్వార్టర్స్, పాతిన వారి వీధి, కొత్తకోట వారి వీధి, గణేష్ నగర్, పాలపోలమ్మ గుడి, మెయిన్ రోడ్డు, లక్ష్మీనగర్ వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. ప్రజలు గమనించి విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రేపు..

ఈనెల 19న శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డిఎస్ఎస్ పనుల్లో భాగంగా నూతన ఫీడర్లు ఏర్పాటు, చెట్లకొమ్మలు తొలగింపు, విద్యుత్ లైన్ల నిర్వహణకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని గాజుల కొల్లివలస, చిన్న జొన్నవలస, మునగవలస, హక్కులపేట, రామచంద్రాపురం, పొన్నంపేట, చిట్టివలస, సైలాడ, దన్నానపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని తెలిపారు.

జగన్‌ను కలిసిన విజయ


జగన్‌తో మాట్లాడుతున్న విజయ

ఇచ్ఛాపురం : తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి పరిస్థితులు, నేతల పనితీరుపై చర్చించారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి- పలాస

పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యం పెంపొందుకుంటేనే విజయాలు సాధించగలమని, నైపున్యాతోనే పోటీ పరీక్షల్లో ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందని ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎం.హెచ్.కె.ప్రసాద్ అభిప్రాయపడ్డారు. స్థానిక విద్యావాహిని డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన స్వాగతోత్సవ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పాతపట్నం సబ్జైజరీ అధికారి పేరాడ మన్మథరావు మాట్లాడుతూ తన జీవితంలో ఎన్నో సవాల్‌ను ఎదుర్కొని నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యాయని ఆయన జీవిత విషయాలను ఉదాహరణతో వివరించారు. పూండి సాయివినీత్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కైలాస్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కొని విజయాలను సాదించాలని సూచించారు. ప్రిన్సిపాల్ అయిధం గిరిబాబు అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పైల తిరుమలరావు, డైరెక్టర్లు సంధ్యారాణి, పైల మన్మథరావు, ఎఒ ఖగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిద సాంస్కృతిక కార్యక్రమాలు అధ్యాంతరం అలరించాయి.

పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచిత టీకాల పంపిణీ ముమ్మరంగా కొనసాగుతందని టెక్కలి ఉపసంచాలకులు డాక్టర్ చందక నరసింహులు అన్నారు. మండలంలోని చౌదరికొత్తూరులో ప్రత్యేకంగా టీకాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పశువైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞ చైతన్య ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. చౌదరి కొత్తూరు, హరిశ్చంద్రపురం, దంత, వెంకన్నపేట, బడ్డిపేట, చలమయ్యపేట గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ సిబ్బంది సక్రియంగా పాల్గొని 562 పశువులకు ఉచిత టీకాలు వేశారు.

టెక్కలి రూరల్ : మండలంలోని సన్యాసిపేట, పోలవరం, భగవాన్‌దాసుపురం, తలగాం గ్రామాల్లో 95 పశువులకు ఉచిత గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మెట్ట పూర్ణచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో లింగాలవలస పశువైద్యశాల సిబ్బంది వరలక్ష్మి, ధనలక్ష్మి, తనూజ, బలరాం, గ్రామ పెద్దలు పొన్నాడ రాజారావు, నూక కనకారావు, పంగ మన్మథ, పేడాడ బలరాం పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల నిరసన

ఇచ్ఛాపురం: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజున జాతీయ నిరుద్యోగ దినోత్సవం నిర్వహించాలని, 'నౌకరీ చోర్- గద్దె చోడ్'అనే నినాదంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ పుట్టిన రోజునే 'జాతీయ నిరుద్యోగ దినోత్సవం'గా పాటిస్తున్నామని అన్నారు. పట్టణాల్లో 29 ఏళ్లలోపు యువతలో 19 మంది నిరుద్యోగులు, 20-24 ఏళ్ల వయసు గల భారతీయుల్లో 44.5 శాతం మందికి ఉద్యోగాలు లేకవార్ధికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వేతనాల వృద్ధి 2006లో 9.3 శాతం ఉందని, 2023లో కేవలం 0.1 శాతానికి పడిపోయిందని గణాంకాలు చెబుతున్నాయని అన్నారు. భారతీయ కుటుంబాల పొదుపులు 50 ఏళ్ల కనిష్ట స్థాయికి చేరుకునాయని అన్నారు.

ఎన్‌సిసి విద్యార్థుల విగ్రహాల శుభ్రత

ఆమదాలవలస: ఎన్‌సిసి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విగ్రహాల శుభ్రత కార్యక్రమాన్నిఎన్‌సిసి కేడెట్లు నిర్వహించారు. బుధవారం ఎస్ఎస్‌సిడిలో భాగంగా 14 ఆంధ్ర బెటాలియన్, ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి జెడి (బాలురు) జెడబ్ల్యూ (బాలికలు) సబ్‌యూనిట్ క్యాడెట్లు పట్టణంలోని జూనియర్ కళాశాల వద్ద అంబేద్కర్, మున్సిపల్ కార్యాలయ రహదారి వద్ద సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలకు, జాతీయ నాయకులు, స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం పైల రవికుమార్, ఎన్‌సిసి చీఫ్ ఆఫీసర్ పి.మోహన్‌రావు, సెకండ్ ఆఫీసర్ బి.శరత్‌కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న ఎన్‌సిసి కేడెట్లు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కెవి రోడ్డు నుంచి కడుము వరకు రూ.25 లక్షలు ఉపాధి నిధులతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సౌకర్యం, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి పనులు ఎటువంటి అడ్డంకులు లేకుండా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ, టిడిపి మండల అధ్యక్షులు అగతమూడి మాధవరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు అగతముడి అరుణ్ కుమార్, నాయకులు సిహెచ్.రాము, టి.తిరుపతిరావు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికల కోసం టెక్కలి డివిజన్‌స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించారు. పది మండలాల నుంచి 40 పాఠశాలలకు చెందిన 378 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంఇఒ చిన్నవాడు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమానికి సహకరించిన ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంఇఒ-2 అర్జున్, హెచ్ఎం పిట్ట గంగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనలకే పరిమితం చేయాలి

ప్రజాశక్తి పోలాకి

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, అప్పుడే నాణ్యమైన విద్య అందుతుందని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా ఈదుపురం ఎపి మోడల్ స్కూల్, ప్రైమరీ స్కూల్, పోలాకి, ప్రియాగ్రహారం, సుసరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాప్‌ల భారం, అసెస్మెంట్ పుస్తకాల నిర్వహణ ఉపాధ్యాయులకు తలకుమించిన భారంగా తయారైందన్నారు. అలాగే ప్రీమియం చెల్లిస్తున్నా వైద్య సేవలు సరిగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి డి.దాలప్పన్న, జిల్లా సలహాదారు బగాది రామారావు, ఎస్.మురళి, బి.రాజు, సిహెచ్.లక్ష్మణరావు, కళావతి, హేమలత పాల్గొన్నారు.

భూ కబ్జాలపై పోరాటానికి సిద్ధం

ప్రజాశక్తి- కవిటి

భూములను కబ్జా చేసిన భూస్వాములపై అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాటానికి సిద్ధం కావాలని సిపిఐ నాయకులు చాపర సుందర్‌లాల్ పిలుపునిచ్చారు. మండలంలోని గొర్లపాడు పంచాయతీలో చెరువులు, వ్యవసాయ భూములు కలిపి సుమారు 15 ఎకరాలు భూస్వాముల కబ్జాలకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి అధ్యక్షతన కాజూరులో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కబ్జా చేసిన భూములను తిరిగి రక్షించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో ప్రజలంతా కలిసివస్తే తప్ప భూస్వాముల అణచివేత ఆగదని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు పుక్కల్ల అరేలమ్మ, అయినింటి లోకనాథం, సర్పంచ్ కరగాన వల్లభరావు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ'పై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం నుంచి 'స్వచ్ఛతా హీ సేవ'పై అవగాహన కల్పిస్తున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర అన్నారు. పురుషోత్తపురం హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపైన బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజుకు సన్మానం

నరసన్నపేట: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బాడాన రాజును స్కూల్ టీచర్స్ అసోసియేషన్ తరుపున బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని చందనరావు మాట్లాడుతూ పాఠశాలపై అంకితభావం, వృత్తిపై నిబద్ధతే రాజుకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తెచ్చి పెట్టిందన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, విద్యారంగానికి రాజు విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు. సంఘ జిల్లా నాయకులు బి.రామారావు, దాలప్పన్న మాట్లాడుతూ వినూత్న బోధన పద్ధతులతో విద్యార్థుల ఆకట్టుకునే విధంగా బోధించగల విషయ నిపుణులు రాజు అని అన్నారు. తాను ఏ పాఠశాలలో పనిచేసినా, ఆ పాఠశాలను విద్యాపరంగా అభివృద్ధి పథంలో నిలపడం రాజుకే సొంతమన్నారు. కార్యక్రమంలో ఎస్.మురళి, చింతాడ లక్ష్మణరావు, మూల వేణుగోపాలరావు, జగన్, నారాయణరావు, హేమలత, రమణ, రఫీ, రాజేశ్వరరావు, కళావతి పాల్గొన్నారు.

బందపల్లిలో గ్రామసభ

మెళియాపుట్టి: ఆది కర్మ యోగి కార్యక్రమం ద్వారా గిరిజనులకు మేలు చేకూరుతుందని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అన్నారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీలోని బందపల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. గ్రామంలో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేసి గ్రామస్తుల కోరిక మేరకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యం, అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ ఎస్. శ్రీనివాసరావు, పరిశీలకులు రాహుల్ పురాణ, బి.దినకర్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

కొత్తూరు: మండలంలోని ఒంద్రుజోలకు చెందిన గొర్లె కూర్మారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సామాజిక వేత్త, ఎంపిహెచ్ డెవలపర్స్ బామిడి రాజు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కృషితో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.53,900 చెక్‌ను కూర్మారావు భార్య ధనలక్ష్మికి బుధవారం అందజేశారు.పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ, అగతమూడి అరుణ్‌కుమార్ తదితదరులున్నారు.